క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 31న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ చౌరస్తా, కాకాజీ కాలనీ, బస్టాండ్ రోడ్డు, అలంకార్ జంక్షన్, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు ఈనెల 31న ఉదయం పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ విశాల మహేందర్ తెలిపారు.

రేపు జిల్లా నాటక సమాజాల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ కల్చరల్: జిల్లా నాటక సమాజాల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం వరంగల్ పోతన విజ్ఞానపీఠంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, కార్యదర్శి కాజీపేట తిరుమలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రంగస్థల కళాకారులు ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు బృందగీతాల పోటీలు

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం హనుమకొండలోని సామ జగన్మోహన్ స్మారక భవనంలో విద్యార్థులకు బృంద గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీకర్‌కుమార్, జిల్లా జనరల్ సెక్రటరీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగింపు కార్యక్రమంలో అదేరోజు సాయంత్రం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా సెన్సార్ బోర్డు సభ్యుడు నాగేశ్వర్, వాసవి క్లబ్ వరంగల్ సెక్రటరీ వీరన్న హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీవీపీ సెక్రటరీ వెంకటరెడ్డి, ఎస్‌జీఎస్‌సీ కన్వీనర్ కమలా మనోహర్ పాల్గొంటారని వివరించారు.

ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగాధిపతికి సన్మానం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు విభాగం అధిపతిగా డాక్టర్ కర్రె సదాశివ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సదాశివ్‌ను పలువురు అధ్యాపకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు మామిడి లింగయ్య, చిర్ర రాజు, చింతం ప్రవీణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేష్, అంజన్‌రావు, కరుణాకర్‌రావు, ఫిరోజ్‌పాషా, తాళ్లపెల్లి సంజీవ, నాగయ్య, శ్రీలత, మౌనిక, జ్యోత్స్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవర్ హల్‌చల్

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేటలో మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఇష్టారాజ్యంగా నడపడంతో పాటు రోడ్డు పక్కన నిలిపిఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలు అయినట్లు సమాచారం. ఆ కారును పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ సంఘటనపై ఎవరు ఫిర్యాదు చేయలేదని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

ఆజంజాహి రిటైర్డ్ కార్మికుడి మృతి

ఖిలా వరంగల్: వరంగల్ ఆజంజాహి మిల్ రిటైర్డ్ కార్మికుడు రంగశాయిపేటకు చెందిన దారబోయిన సమ్మయ్య శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద వలంటరీ రిటైర్డ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఇనుమల శ్రీనివాస్, చంద్రమౌళి, రాజలింగం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వరంగల్ ఇండస్ట్రీస్ జీఎం వీఎస్.రాజు



వరంగల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం అభివృద్ధి మార్గంలో పయనిస్తుందని వరంగల్ జిల్లా ఇండస్ట్రీస్ జీఎం వీఎస్.రాజు అన్నారు. వరంగల్ 19వ డివిజన్ సొసైటీ కాలనీలోని స్వశక్తిభవన్ (కమ్యూనిటీహాల్)లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నైపుణ్య శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మా జనని ఉమెన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరు వారాల బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలను అభినందించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 31 మంది మహిళలకు సర్టిఫికెట్లు, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటపోటీల విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షురాలు వడ్డేపల్లి మాధవి, డైరెక్టర్లు సౌమ్య, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



మడికొండ: పూజలు చేస్తున్న భక్తులు

మడికొండ: పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్రహోమం చేశారు. శ్రీరాముడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

కాశీ విశ్వేశ్వర ఆలయంలో కుంకుమ పూజ

వరంగల్ చౌరస్తా: శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కుంకుమ పూజను శుక్రవారం నిర్వహించారు. సోమనాథ్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు లంకా శివకుమార్ వేద మంత్రోచ్ఛరణల మధ్య లలితా పారాయణం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్ట్ ఆకారపు హరీశ్ – స్వాతి దంపతులు, ఆలయ ఈఓ కిషన్‌రావు, భక్తులు నాగలక్ష్మి, పావని, శార్వాణి, సుజాత, సునీత, శ్రీవల్లి, పద్మజ, లత, కళావతి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



తీరొక్క పూల అలంకరణలో పద్మాక్షి అమ్మవారు

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షిదేవి

హన్మకొండ అర్బన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షిదేవి అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చినట్లు ఆలయ అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ తెలిపారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వివరించారు. అనంతరం తీరొక్క పూలతో అమ్మవారిని అలంకరించినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ జ్ఞానేశ్వర్

వరంగల్: గురుపూజోత్సవాన్ని విజయవంతం చేయాలని వరంగల్ డీఈఓ ఎం.జ్ఞానేశ్వర్ అన్నారు. గురుపూజోత్సవ నిర్వహణ, ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానంపై హనుమకొండ సుబేదారిలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వివిధ కమిటీల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుపూజోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ఆహ్వాన, రిసెప్షన్ కమిటీ, నిర్వహణ, కొనుగోలు కమిటీ, సాంస్కృతిక కమిటీ, సర్టిఫికెట్లు, మెమెంటోల కమిటీ, వేదిక, సీటింగ్, ప్రెస్, డాక్యుమెంటేషన్, ప్రోగ్రాం యాంకరింగ్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని ఆకుతోట ఫంక్షన్‌హాల్‌లో గురుపూజోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీఐపీలను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని, కమిటీలు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా సెక్టోరల్ అధికారులు సుజన్‌తేజ, ఫ్లోరెన్స్, కుడికాల సుభాష్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, డీఎస్‌ఓ శ్రీనివాస్, ఏసీజీఈ నర్సింహరావు, ఎంఈఓ విజయ్‌కుమార్, గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో నిధుల దుర్వినియోగం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నయీంనగర్: తెలంగాణ మైనార్టీ గురుకుల స్కూల్, కళాశాలల్లో అడ్మిషన్లలో వివక్ష, నిధుల దుర్వినియోగం జరుగుతోందని బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.నయీమొద్దీన్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ఎండి.నయీమొద్దీన్, ఎస్‌డి.మసూద్, ఎండి.నయీమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో మైనార్టీలకు అన్యాయం జరుగుతోందని వారు ఇచ్చిన హామీలు అమలు జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఆహారంలో నాణ్యతలో ప్రమాణాలు పాటించడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. షాదీ ముబారక్ పథకం అమలు కావడం లేదని, మైనార్టీలకు రూ.వేయి కోట్ల నిధుల హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖుద్దూస్, షఫీ అహ్మద్, మొహిదుద్దీన్, ఖలీల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని ధర్నా



బల్దియా ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

వరంగల్ అర్బన్: వరంగల్ అండర్ రైల్వే గేట్ పరిధిలోని 40వ డివిజన్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి నేతృత్వంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మేయర్, కమిషనర్, అధికారుల నిర్లక్ష్యం వల్ల డివిజన్‌లోని బాక్స్ డ్రైన్ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వకపోవడం, పనులు జరగక పోవడంతో శ్మశాన వాటిక మునిగిపోతోందన్నారు, మట్టి రోడ్లు ఎగుడుదిగుడుగా దర్శనమిస్తున్నాయని, తాగునీటి పైపులైన్లు, కరెంటు స్తంభాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అడిషనల్ కమిషనర్ రాజేందర్ రెడ్డికి అందజేశారు. పూజారి విజయ్, ఆవుల శ్రీకాంత్ కూరపాటి రాజన్‌బాబు, ఆవునూరి ఐలేశం, ఆవునూరి నాగరాజు, శ్రీపాద హరిప్రసాద్, మదూరి సుధాకర్, అన్న శ్రీనివాస్, పసునూరి రాజు, పుష్పలత, వనం కుమార్, మరుపల్ల గౌతమ్, శెట్టి మోహన్, గజ్జి సాంబయ్య పాల్గొన్నారు.

బోనాల పండుగను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: నగరంలోని వడ్డెపల్లిలో ఆదివారం నిర్వహించనున్న పోచమ్మ బోనాల పండుగను కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మాజీ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. వడ్డెపల్లిలోని పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో గ్రామ పెద్దలు, కులసంఘాల ప్రతినిధులతో వినయ్‌భాస్కర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణ, గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులు రాజన్న, రాంబాబు, సమ్మయ్య, నవీన్, సతీష్, కుమారస్వామి, భిక్షపతి, వెంకన్న, కోటి, రమేష్, సంపత్‌రెడ్డి, రవీందర్, రాంచందర్, గణేష్, సురేష్, రవి, నాగరాజు, సంతోష్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మడికొండ: గణపతి నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సూచించారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని గణపతి మండపాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మండపాలను ఇరుకుగా ఉన్న వీధుల్లో ఏర్పాటు చేయకూడదని, గణేష్ మండపాల వద్ద కనీసం ముగ్గురు వలంటీర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ఎస్సై రాజబాబు, పోలీసు సిబ్బంది, గణపతి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్వేతార్కలో ఆధ్యాత్మిక ఉత్సవాలు

కాజీపేట: పదహారు రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఘనంగా సాగే గణపతి ఉత్సవాలు విజయవంతంగా సాగేలా తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నిమగ్నమైనట్లు శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ తెలిపారు. కాజీపేట శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయంలోని 29 దేవతామూర్తులకు వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. శ్వేతార్కుడిని జిల్లా కోర్టు జాయింట్ డైరెక్టర్ చీపూరి రాము దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, ఆలయ ఇన్‌చార్జ్‌లు దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, గంగుల రాజిరెడ్డి, కమటం భాస్కర్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ

59వ డివిజన్ పరిధి హనుమకొండలోని స్నేహ నగర్ రోడ్డు నంబర్ -4లో మాంటిస్సోరి స్కూల్ ఎదుట మురుగునీరు పొంగి పొర్లుతోంది. మురుగంతా రోడ్డుపైకి చేరడంతో బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, పిల్లలు జారి పడిపోతున్నారు. ఈ సమస్యను పట్టించుకునే వారు కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు.

– హన్మకొండ

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
డాక్టర్ రాజేశ్, సీఎంహెచ్‌ఓ
ఫోన్‌నంబర్ : 97019 99689

అధికారి వచ్చినప్పుడే రిజిస్ట్రేషన్లు!

వరంగల్: వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమయపాలన లేకుండా పోయింది. అధికారి వచ్చినప్పుడే రిజిస్ట్రేషన్లు చేస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోచమ్మమైదాన్ సమీపంలోని వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వరంగల్ మండలంలోని దేశాయిపేట, లక్ష్మీపురం, మట్టెవాడ, పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట, ఏనుమాముల రెవెన్యూ గ్రామాల పరిధిలోని 12 బ్లాకులు, గీసుకొండ, సంగెం మండలాల పరిధిలోని స్థిరాస్తి, స్థలాలు, భవనాల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యకలాపాలు నిర్వహిస్తారు. కానీ, ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఉన్నాయని డాక్యుమెంట్ రైటర్ల నుంచి ఫోన్లు వస్తే తప్ప అధికారి కార్యాలయానికి రాని పరిస్థితులు ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి రిజిస్ట్రేషన్ కావాలన్న ముందుగా డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదిస్తేనే కార్యక్రమం సాఫీగా సాగనుంది. లేదంటే అడుగడుగునా అడ్డంకులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం ఉదయం రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని 'సాక్షి' సందర్శించింది. ఉదయం 11.20 గంటల వరకు రిజిస్ట్రార్ కుర్చీ ఖాళీగా కనిపించింది. కార్యాలయంలో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది వారి పనుల్లో మునిగిపోయారు. సార్ ఎప్పుడు వస్తాడని ఉద్యోగిని అడిగితే వస్తారు అన్న సమాధానం తప్ప ఏ సమయానికి వస్తాడు అన్న విషయం చెప్పలేకపోయారు. అధికారి లేక రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో అమ్మేవారు, కొనేవారు కార్యాలయ ఆవరణలోని చెట్లకింద కూర్చునున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం సాక్షులుగా సంతకాలు చేసేందుకు వచ్చిన వారి పరిస్థితి వర్ణనాతీతం. సార్ ఎప్పుడు వస్తాడు అని అడిగితే క్రయవిక్రయదారులు ఏమి చెప్పలేని పరిస్థితి. ఎప్పుడు అధికారి వస్తే ఆసమయంలోనే పని పూర్తి చేసుకోవాలని కొందరు డాక్యుమెంట్ రైటర్లు ఉచిత సలహాలు ఇస్తున్నారు. అధికారి మధ్యాహ్నం 12.08 గంటలకు రావడంతో చకచకా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఉదయం కార్యాలయంలో అధికారి ఉంటే రిజిస్ట్రేషన్ ముగిస్తే వెంటనే మరో పని కోసం వెళ్లే వారమని, భూమి అమ్మినా, కొనుగోలు చేసినా రెండు రోజులపాటు రిజిస్ట్రేషన్ కోసం తిరగాల్సి వస్తోందని పలువురు వాపోయారు. అధికారులు, సిబ్బంది కార్యాలయ పనివేళల్లో అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఒయాసిస్ అనాథాశ్రమ విద్యార్థుల ఫీజు చెల్లింపు



హన్మకొండ: హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని గౌతమి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఫీజును ఆస్ట్రేలియా తెలుగు అసోసియేషన్ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ కమిటీ చెల్లించింది. గౌతమి హైస్కూల్‌లో స్కూల్ ప్రిన్సిపాల్ టి.రాజేశ్వర్ రావును ఆస్ట్రేలియా తెలుగు అసోసియేషన్ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధి గాదె సంజీవ రెడ్డి, జిల్లా బాలల సంక్షేమ అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, ఒయాసిస్ అనాథాశ్రమ వ్యవస్థాపకుడు ఒద్దిరాజ్ చంద్రప్రకాశ్ కలిసి శుక్రవారం పదవ తరగతి విద్యార్థులు ఆర్.శశాంక్, కె.శివ విద్యాభ్యాసానికి రూ.70 వేల ఫీజును చెక్కు ద్వారా అందజేశారు.

విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



సాంబయ్యను సన్మానిస్తున్న కలెక్టర్, జెడ్పీ సీఈఓ, తదితరులు



శంకర్‌రావును సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

హన్మకొండ: హనుమకొండ జిల్లా ప్రజా పరిషత్ ఆఫీస్ సబార్డినేట్ దావ సాంబయ్య సేవలు అభినందనీయమని కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రశంసించారు. హనుమకొండలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సాంబయ్య పదవీ విరమణ అభినందన సన్మాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సాంబయ్యను కలెక్టర్ ప్రావీణ్య, హనుమకొండ జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత, తదితరులు సన్మానించారు. డిప్యూటీ సీఈఓ బి.రవి, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ శంకర్‌రావుకు..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఈనెల 31న శంకర్‌రావు ఉద్యోగ విరమణ పొందబోతున్నారు. ఈమేరకు కళాశాలలో ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేందర్, కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంచంద్రం శుక్రవారం శన్మానించారు. అలాగే, కేయూ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉద్యోగి కె.రవీందర్‌ను కూడా సన్మానించారు. కార్యక్రమాల్లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి మల్లారెడ్డి, అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను ప్రకటించాలి



సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

కాజీపేట: ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండెల సుధాకర్ పదవీ విరమణ సన్మానోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ ఉద్యోగులకు మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, నెహ్రూ, ఎంఈఓ రామ్‌కిషన్ రాజు, సీహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు, రవీందర్ రాజు, సదాశివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాగ్రత్తగా మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న సూర్యనారాయణ

కాశిబుగ్గ: నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ తెలిపారు. సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై షీ టీమ్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ నరేంద్రనగర్ హైస్కూల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని కోరారు. సైబర్ నేరాలు జరిగితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు వేణు, స్వామి, ప్రవీణ్, కుమారస్వామి, షీ టీమ్ సిబ్బంది సూర్యనారాయణ, వంశీ కృష్ణ, సువార్త పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బల్దియా సీనియర్ ఆడిటర్‌గా ఆనంద్

వరంగల్ అర్బన్: బల్దియా ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సీనియర్ ఆడిటర్‌గా ఆనంద్ శుక్రవారం విధుల్లో చేరారు. రాష్ట్ర ఆడిట్ డైరెక్టర్ విభాగంలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. 8 నెలల క్రితం అవినీతి, ఆరోపణలతో బదిలీపై వెళ్లిన సతీశ్ స్థానంలో ఆయన నియామకమయ్యారు.

ప్రతీ ఉద్యోగికి బదిలీలు సహజం

ఖిలా వరంగల్: ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమని, ఎవరికీ మినహాయింపు ఉండదని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.సంపత్‌కుమార్ అన్నారు. శంభునిపేటలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం జరిగింది.

వరంగల్ కలెక్టర్‌ను కలిసిన ఎంపీ కావ్య

వరంగల్: వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారదను ఎంపీ కడియం కావ్య శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీని కలెక్టర్ సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలోని పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్, ఆర్కియాలజీ సర్వే తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైందని సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లా కనిగిరి గ్రామానికి చెందిన గుండపల్లి గురవారెడ్డి తన భార్యతో కలిసి శుక్రవారం ఉదయం పనికి వెళ్లగా, ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు అంటుకొని వారి ఇల్లు పూర్తిగా కాలిపోయిందని పేర్కొన్నారు. సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేసినట్లు వివరించారు.

ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

హసన్‌పర్తి: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ సూచించారు. హసన్‌పర్తి మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కాశిబుగ్గ: బీజేపీ నూతన సభ్యత నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలెపాక మార్టిన్ లూథర్ పిలుపునిచ్చారు. 18వ డివిజన్‌లో అధ్యక్షుడు బొడ్డు రాకేష్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

హన్మకొండ: హనుమకొండ వెంకటేశ్వర కాలనీలోని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన సమితి జమ్మికుంట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం కృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటాచార్యులు, సభ్యులు రాధిక, శశికాంత్, దివ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంజీఎంకు నవజాత శిశువు తరలింపు

ఎంజీఎం: అప్పుడే పుట్టిన నవజాత శిశువు శ్వాస తీసుకోవడంలో 108 సిబ్బంది శిశువును అత్యవసరంగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించిన సంఘటన శుక్రవారం చోటుచేసుంది. నగరంలోని శాంతినగర్‌కు చెందిన రమీసాబేగం.. సీకేఎం ఆస్పత్రిలో ప్రసవించగా, నవజాత శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటంతో మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు అత్యవసరంగా 108 అంబులెన్స్‌లో ఆక్సిజన్ సహాయంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో 108 ఈఎంటీ స్వాతి, పైలట్ సదానందం ఉన్నారు.

వాగ్దేవికి పార్ట్‌నర్‌షిప్ అవార్డు

ఖిలా వరంగల్: హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూప్లాజా హోటల్‌లో శుక్రవారం జరిగిన అకడమిక్ లీడర్స్ కనెక్ట్ మీటింగ్‌లో వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలకు మొంగోడిబి అకడమిక్ పార్ట్‌నర్‌షిప్ అవార్డు దక్కింది. అసోసియేట్ డీన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇండస్ట్రీ ఇంటరాక్షన్స్ డాక్టర్ చింతకింది రాజు హాజరై అకడమిక్ అధికారుల నుంచి అవార్డును అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

వరంగల్: దేశాయిపేట గ్రామానికి చెందిన పోలెపాక అనిల్ (27) తన మిత్రుడి శుభకార్యానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పైడిపల్లి గ్రామంలోని స్థూపాల సమీపంలో తను నడుపుతున్న బండి అదుపుతప్పి కింద పడ్డాడు. దాంతో అతని తలకు బలమైన గాయాలు కాగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి మేనమామ పెరుమండ్ల సుధాకర్ ఫిర్యాదు మేరకు ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.